కథానిక

# ప్రతీకారం

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

రెండోవాడు తెగించి కనక పెళ్ళి చేసుకోక పోతే, పెద్దబ్బాయికి పెళ్ళవటం పెద్ద సమస్యగానే పరిణమించేది. పెద్దబ్బాయికి పెళ్ళయ్యేటంత వరకు ఆగాలసివస్తే, రెండో అబ్బాయి పెళ్ళి యిప్పట్లో అవుతుందని తోచదు. రెండో వాడికి పెళ్ళయిందని అవతలవాళ్ళకు తెలుస్తే మాత్రం, పెద్దబ్బాయికి పిల్లనివ్వటమే అనుమానం. అసలు నిజం, రెండోవాడి పెళ్ళయింది కాబట్టే, పెద్దవాడు యెట్లాగోట్లా గృహస్థుడయ్యాడు. అందువలన, రెండోవాడు పెళ్ళిచేసుకుని, పెద్దబ్బాయి బ్రహ్మచారిత్వం వదిలిచ్చాడన్నమాట! పెద్దవాడి సంగతి తెలిసింది కాబట్టే, ఎప్పుడో అవాలసిన మేనరికం కాకపోయింది. రెండోవాడికి పెళ్ళయ్యేదాకా మేనమామకి తెలియనే తెలియదైను. మేనరికం, మేనరికం అంటూ యింటిల్లిపాదిజనం ఒక్క గొంతుకతో కేకలు, బొబ్బలు పెడుతూనే వున్నారు. మేనరికం వుద్దేశంకూడా, బంధుత్వం కలుపుకుంటూ, వంశాభివృద్ధికి తోట్పాటుగా వుండి, యిద్దరు సుఖపడాలనేదే! చివరి రెండూ లోపించిన తర్వాత బంధుత్వం కోసమే పెళ్ళిళ్ళు జరగాలనే సిద్ధాంతవాదులు వున్నా, కనీసం అనుభవించేవాళ్ళైనా అలాంటి వాటికి యెదురు చెప్పకండా వుంటారా? త్రాగుబోతు భర్త, బావ అవుతే, పరాయివాడవుతే! దమ్మిడీకి కొరకాని బావ భర్త అవటంలో సుఖం యెవరికో అర్థంకాదు. అలాంటి మనిషి యెవరికైనా భర్త కావటమే శ్రేయస్కరం కాదు. అందులో మేనమామ కూతురికి భర్తకావటం మరింత దురదృష్టం కాని వ్యక్తిత్వాన్ని సహించలేని కొందరు పెద్దవాళ్ళు పిల్లల గొంతుకలు కోయటానికి వెనుదీయరు. ఇద్దరూ అవస్థపడుతుంటే చూసి బాధపడేది మళ్ళీ వీళ్ళే, ఇద్దరూ సుఖంగా వుండాలనే వుద్దేశంతోనే పెళ్ళి చేశామంటూ గొప్ప చెప్పుకుంటారు. పెళ్ళి చేసేవాడు లేని యోగ్యతలు, ఆడదానిలోను మగవాడిలోను మర్నాటినుంచి మొలుచుకు వస్తాయా? అప్పటికీ తల్లి శతవిధాల ప్రయత్నం చేసింది అమ్మాయిని లొంగదీద్దామని కాని, అమ్మాయి పసిపిల్లకాదు అన్నింటికి తలవూపటానికి 'ఎవరికో వకరికి భార్యగా అవటానికి నేను పుట్టలేదు. ఎవరికోవరకరికి భార్యగా అవాలసినమాట నిజమైనా నా స్వేచ్ఛ వుపయోగించి, నాకు భర్తగా వుండగలవాడినే వప్పుకుంటాను' అని నిర్దిష్టంగా చెప్పేసింది. ఎనిమిదేళ్ళ లోపునే పెళ్ళయిన పెద్ద ముత్తయిదులందరు ముక్కుమీద వేలు వేసుకున్నారు. తండ్రి తటస్థంగా వుండిపోయాడు. పెద్దవాడు మేనమామ కూతురికి భర్త కాలేకపోయాడు, రెండోవాడికి భార్య కాలేకపోయింది వసంత.

'ఘూశావా, రవిబావను పెళ్ళిచేసుకోమంటే ససేమిరా అంటూ మొహం చిటచిట లాడించావు, ఏం లోపం వచ్చిందని మధుబావ, మధుబావ అంటూ కూర్చున్నావు? అతగాడు మనెవ్వరికీ తెలీకుండానే పెళ్ళిచేసుకుని కూర్చొనె. దేనికైనా ఆలోచించి చెయ్యాలి అమ్మాయీ...' శాంతమ్మ కూతుర్ని అంటోంది.

వసంతకు పట్టరాని వుక్రోషం వచ్చేసింది. కళ్ళల్లో నీళ్లు కనపడనీయకండా బింకంగా అట్లాగే చూస్తోంది, మధు యింత ద్రోహం చేస్తాడని అనుకోలేదు. తనంటే యెంతో ప్రేమ. మధుకు పెళ్ళయిందని మాటమాత్రం తెలుస్తే, రవిబావను పెళ్ళి చేసుకుని, మధుమీద కసితీర్చుకునేదాన్ని, అయినా అన్నదమ్ముల వైరానికి నా పెళ్ళికి సంబంధం యేమిటి? మధుకు సాధించాలని. నా జీవితంలో నిప్పులు పోసుకోవటమేనా? ఛీ! పాడు అభిప్రాయం నన్నుచూసి అసూయపడేలాగ చెయ్యాలి మధును.

ఉబుక్కువస్తున్న దుఃఖాన్ని, ధైర్యంగా మార్చేసుకుంది వసంత.

"నేను చేసింది బాగా ఆలోచించే చేశా... ఆలోచన లేకపోవటంవల్లనే- మధు యీనాడు పెళ్ళిచేసుకుని కూర్చున్నాడు."వసంత గట్టి గొంతుకతో అనేసింది.

"ఎట్లాగైనా బాధపడుతున్నది మనమేగా."

"ఈ సంగతి అవతలవాళ్ళకు తెలుస్తే యింకా బాధపెడతారు. ఆలోచనలే కూడా చేసినవాళ్ళే బాధపడాలిగాని, మనం బాధపడేదేమీలేదు."

"ఇప్పుడెట్లాగే నీ పెళ్ళి చెయ్యటం" శాంతమ్మ వాక్యం పూర్తిచెయ్యక మునుపే వసంత అందుకుంది

"దేశంలో మగవాళ్లే కరువయ్యారా!"

"ఏమిటా అల్లరిమాటలు, ఎవరన్నా విన్నా కూడా యేమనుకుంటారు. ఆడపిల్ల, ఆడపిల్లరీతి వుండాలిగాని ఇట్లా మాట్లాడుతూంటే యేమన్నా సొంపు వుంటుందా."

"అమ్మా! నీకేమి అర్థంకాదే." పెద్దపెట్టున యేడుస్తూ గదిలోకి వెళ్ళి మంచంమీద దభాలున పడుకుంది వసంత.

"ఏమిటాగోల" వర్మ ప్రక్కగదిలోంచి ఒక్క అరుపు అరిచాడు.

"రోజూ వుండే గోలే. ఇవ్వాళ క్రొత్తగా యేంరాలా" శాంతమ్మ సమాధానం చెప్పటానికి అలస్యం యేమీ చెయ్యలేదు.

వర్మ గభాలున లేచి వచ్చాడు

"ఇప్పటికైనా బుద్ధివచ్చిందా. పెద్దవాళ్ళ మాట వినకపోతే యిట్లాగే వుంటుంది."

"బాధ పడుతున్న దాన్ని ఇంకా బాధ పెడతారేమిటి"

"అనసీవే నువ్వెందుకు ఆపుతావు. బాధపడే వాళ్ళకే యేదైనా బాధ. మధ్య నాకేమిటి" వసంత నిబ్బరంగా అన్నది.

"ఉత్తరం వచ్చిందండి."

నిర్లక్ష్యంగా వుత్తరాన్ని తీసింది కవరు చించేసి వసంత. వ్రాసింది మధు. మహాకోపంగా చదివేసింది ఉత్తరాన్నంతా.

"నన్ను నమ్మించాలని యింకా ప్రయత్నం చేస్తున్నాడన్నమాట. పెళ్ళి కాలేదుట ఎంత మోసం. ఇవన్నీ అపవాదులే అని యెవరికి చెప్తాడు! నా జీవితంలో ఒక్కసారే మోసపోయాను. అంతే. ఇంకా మగవాళ్ళమాటలువిని మోసపోవటం కల్ల" వసంత వుత్తరాన్ని అవతలికి గిరాటు పెట్టింది.

వర్మ, శాంతమ్మలు ఆ ఉత్తరం వైపునకు ఆదుర్దాగా చూశారు. వసంత, అటు పట్టించుకోకుండానే విదిలించుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది. వసంతకు యేమీ చెయ్యటానికి తోచటంలేదు. మధు వుత్తరాన్ని పదేపదే స్ఫురణకు తెచ్చుకుంటోంది. పెళ్ళి కాలేదని రాస్తాడు ఎంత మోసం పెళ్ళి అవంగానే ఆ భార్యను వదిలిపెట్టివుంటాడు. మధులాంటి మనుషులు ఎవర్ని చేసుకున్నా యిదే తీరుగా! నమ్మి యెంత బాధపడుతున్నాను! ఏమైనా సరే యీ మగవాళ్ళమీద ప్రతీకారం తీసుకోవాల్సిందే. వసంత ఆలోచించుకున్న కొద్దీ వుక్రోషం హెచ్చిపోతోంది. ఏవేవో క్రొత్త క్రొత్తగా ఆలోచించటం మొదలు పెట్టింది. తనకు ధైర్యం వచ్చినట్లనిపించింది. ఇంకా బాగా ధైర్యం తెచ్చుకుంటోంది. ఇక నేను పెళ్ళిచేసుకోను. మగవాళ్ళమీద కసితీర్చుకుంటాను. ఇదీ నా నిర్ణయం. వసంత మనస్సులో అనుకున్నది. కాని తన నిర్ణయంయొక్క కఠినత్వానికి తానే నిలవ తొక్కుకోలేకపోయింది. పెద్దపెట్టున ఏడ్చింది. ఏమీ చేతకాని అసహాయురాలైపోతోంది. ఓ మూల మనస్సు దృఢనిశ్చయంవైపు లాగుతోంది. శరీరం దానికివ్యతిరేకంగా సంచరించాలని ముందుకు వస్తోంది. ఈ సంఘర్షణలో వసంత బాగా నలిగిపోతోంది. వసంత రానురాను చిక్కి శల్యమైపోతోంది. నలుగురూ నాలుగుమాటలు అంటున్నారు. తల్లీతండ్రి పెళ్ళి యెప్పుడు చేసుకుంటావే అమ్మాయీ అంటూ వసంత శరీరాన్ని గుచ్చుతున్నారు. వసంతకు యింకా కొంచెం హృద్వేగం హెచ్చుతోంది. తాను చేసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలని మనస్సులో యెక్కడో వున్నా ఆత్మ గౌరవానికి భంగం అని వసంత బింకంగా అట్లాగే గడిపేస్తోంది.

* * *

ఆనాడు మధ్యాహ్నం వసంత తండ్రి వుత్తరం ఆదుర్దాగా చదువుతున్నాడు.

"విన్నావా...మధు భార్య చచ్చిపోయిందిట. మధు రెండో పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నాడుట. మనమ్మాయికి పెళ్ళికాలేదని తెలిసి..." వసంతవైపునకు చూశాడు వర్మ.

"మొట్టమొదటే మనమ్మాయిని పెళ్ళి చేసుకుంటానంటే యెంత బాగుండేది..." శాంతమ్మ విరసంగా అంది.

"ఇప్పుడు జరగాలిసిందేమిటో చెప్పు. వుత్తరం వ్రాయమంటారా? ఇన్నాళ్ళనుంచి వసంతకు పెళ్ళి కాకపోవటం వీళ్ళిద్దరికి రాసిపెట్టి వుందేమో... అమ్మాయి యేమంటావు, విన్నావుగా అంతా." వర్మ యెన్నడూ లేని చనువుతో వసంతతో అన్నాడు.

వసంత త్రాచుపాములాగ బుస్సుమన్నది. వసంత తమాయించుకుని కొద్దిక్షణాల్లోనే వుద్రేకంగా ఏవేవో అనేసింది.

"ఎంత ఆడపిల్లయినా ఆమాత్రం, అభిమానం వుండదుటండీ. మొట్టమొదటినుంచి తననే పెళ్ళి చేసుకుంటాడనుకునే—చివరకు యిట్లా అయ్యా..."

"నేను నచ్చచెప్పిచూస్తాను." వర్మ వసంతతో చెప్పటం మొదలుపెట్టాడు.

ఆ రాత్రంతా వసంత బాగా ఆలోచిస్తూనే వుంది సమాధానం యేమని చెపుదామా అని. ఒక పట్టాన తనకుతానుగా తృప్తిపడలేకపోతోంది. చిరాకు, అశాంతి యెక్కువయిపోతున్నాయి. గడియారం రెండుగంటలు కొట్టింది. వసంతకు యేదో తట్టినట్లు వులిక్కిపడింది. వసంత మొహంలోనూ యేదో మార్పువచ్చేస్తోంది. ఆ ఆలోచన వసంతకు యెంతో తృప్తినిచ్చింది. ఎప్పుడు తెల్లవారుతుందా అని యెదురుచూస్తూకూర్చుంది. తాను ప్రతీకారం తీసుకోవటానికి మంచి అదను వచ్చిందని సంతోషించింది. తన నిర్ణయాన్ని సడలించుకోవటానికివచ్చిన అవకాశాన్ని వుపయోగించుకుంటోంది. మర్నాడు ప్రొద్దున్నే అతి శాంతంగా వర్మదగ్గరకు వెళ్ళి మీ యిష్టం నాన్నా అన్నది వసంత.

"విన్నావా, అమ్మాయి మధును పెళ్ళి చేసుకోవటానికి వప్పుకున్నది" అన్నాడు శర్మ.

* * *

మధు, తనవాళ్ళతో వచ్చేశాడు. మధు సంతోషంగా యెంతో చనువుగా వసంతవంక చూశాడు. వసంత కూడా యెంతో ప్రేమగా మధువైపు చూసింది. మధు తన గత చరిత్రంతా ఒక్క నిమిషంలో మరిచేపోయాడు. వసంతకు గతంలో జరిగిన విషయాలన్నీ ఒక్కొక్కటే జ్ఞాపకంవచ్చి ములుకులులాగ హృదయాన్ని పొడుస్తున్నాయి. వసంతకు ఓ మూల దుఃఖము, ఓ మూల సంతోషం. రెండు మిశ్రమమయి మనస్సును కలవరపెట్టేస్తున్నాయి. ఓవైపు ఆమె చేసుకున్న నిర్ణయం. ఎదురుగా మధు. తనకు మంచి అదను దొరికిందనుకుంది. ఇక పెళ్ళి మాటల్లోకి వచ్చే ధోరణి కనిపిస్తోంది. వసంత రౌద్రరూపం దాల్చింది.

"ఆడది ఓ వస్తువులాంటిది కాదు. ఎప్పుడు కావాలంటే అప్పు తెచ్చుకోవటానికి. ఆనాడు నీమీద ఆశలు పెట్టుకునివున్న నన్ను ద్రోహంచేసి యింకో ఆడదాన్ని అన్యాయం చేశావు. కంఠం మీదకు వచ్చినతర్వాత పెళ్ళి తప్పనిసరి అయింది. ఈనాడు ఆ అమ్మాయి చచ్చిపోగానే, నామీద నీకు యెక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చింది. నిన్ను పిలిపించింది. నీమీద ప్రతీకారం తీర్చుకోవటానికి కాని, నిన్ను పెళ్ళిచేసుకోవటానికి కాదు. ఈ వసంత నీకు అనుకున్నంత చవక కాదు" ఆ వుద్రేకంలో వసంత యింకా ఏమీ చెప్పలేకపోయింది.

"నాన్నా ... గోపాలరావుగారి అబ్బాయి నన్ను పెళ్ళిచేసుకోవటానికి వప్పుకున్నాడు... అమ్మా..." అంటూ వసంత, శాంతమ్మ వళ్ళో తలదాచుకుని కళ్ళు తుడుచుకుంది.

